
ఆంధ్రజ్యోతి


andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.3 ; కనిష్ఠం 26.7



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

సోమవారం 29 ఏప్రిల్ 2024



● ఈదురుగాలులతో నేలకొరిగిన జొన్న పంట (ఫైల్)



● వడగండ్ల వానతో నేలకొరిగిన మొక్కజొన్న పంట(ఫైల్)

పంటల బీమా.. రైతుకు అండ!

- ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పంటల బీమా పథకం) అమలుకు కేంద్రం ఆమోదం
- జిల్లాలో లబ్ధి చేకూరే అవకాశం ఉన్న రైతుల సంఖ్య 1,54,731
- వర్షాధారంగా ప్రధానంగా సాగవుతున్న సోయా, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము వంటి పంటలు
- ఈ వానాకాలం సీజన్ నుంచి పథకం అమలుకు కసరత్తు
- లోపాలు సరిదిద్దితే మరింత ప్రయోజనం
- జిల్లావ్యాప్తంగా మొత్తం సాగు విస్తీర్ణం 3,52,262 హెక్టార్లు

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 28: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పంటల బీమా పథకం) అమలుకు కేంద్రం ఆమోదం తెలిపింది. వానాకాలం సీజన్ నుంచి అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. పథకం అమలైతే జిల్లాలో 1,54,731 మంది రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉందంటున్నారు. అయితే, ప్రతియేటా వడగండ్లు, అకాలవర్షాలు, తుఫాన్‌లు, అతివృష్టి, అనావృష్టి వల్ల ఎంతో మంది రైతులు పంటలను నష్టపోతున్నారు. ఆరుగాళం కష్టపడి.. పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి విపత్తుల వలన నష్టపోయే రైతన్నలకు ఈ పంట బీమా పథకం వల్ల మరింత అండ చేకూరనుంది. జిల్లాలోని రైతన్నలు ముఖ్యంగా వర్షాధారిత పంటలైన సోయా, పత్తి, మొక్కజొన్న, కంది, పెసరి, మినుములు వంటి పంటలను సాగు చేస్తున్నారు. ప్రకృతిని నమ్ముకుని దేవడిపై భారం వేసి ప్రతియేటా రైతన్నలు పంటలను సాగు చేస్తున్నారు. అంతేకాకుండా అధిక వర్షాలు, లేదా అత్యల్ప వర్షాపాతం, వరదలు, వడగండ్ల వంటి ప్రకృతి విపత్తుల వల్ల రైతులు సాగు చేస్తున్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. నష్టం వాటిల్లిన ప్రతీసారి ప్రభుత్వాలు కొండంత నష్టం జరిగితే.. కేవలం ఇసుమంత పరిహారం అందజేయడం పరిపాటిగా మారిందంటున్నారు. పెట్టిన పెట్టుబడులు సైతం ఎల్లకపోవడంతో అన్నదాతలు బోరుమంటున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం అందజేసే పరిహారం నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకోలేక పోతున్నాయంటున్నారు. ఈ ఫసల్ బీమా పథకం అమలులోకి వస్తే రైతులకు కొండంత అండగా ఉంటుందంటున్నారు.

ఆదుకునే వారే కరువు

2019 నుంచి జిల్లాలో పంటల బీమా పథకం అమలు కావడం లేదు. దీంతో అకాలవర్షాలతో పంటలను నష్టపోయిన బాధిత రైతులను ఆదుకునే వారే కరువయ్యారు. కష్టపడి సాగుచేసిన పంటలు నష్టపోయిన సమయంలో ప్రభుత్వం ప్రాథమిక సర్వేలతోనే సరిపెడుతోందంటున్నారు. కొన్నిసార్లు రైతువారీగా సర్వే చేసేందుకు సంబంధిత వ్యవసాయ శాఖ ముందుకు రాని పరిస్థితి ఉంది. దీనికి తోడు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటున్నారు. ఈ మధ్య యాసంగి సీజన్‌లో కురిసిన వడగండ్లతో జిల్లాలో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. ఈ పథకం అమలులో లేకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం అన్నదాతలు ఎదురుచూపులు తప్పడం లేదు.



బజార్‌హత్నూర్ మండలంలో వరదల వల్ల పూర్తిగా కొట్టుకుపోయిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

లోపాలు సరిదిద్దితే ప్రయోజనం

ఈ పథకం అమలులో లోపాలుండడంతో అన్నదాత కంటే బీమా కంపెనీలే ఎక్కువగ ప్రయోజనం పొందుతున్నాయనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పథకం అమలు నుంచి తప్పుకుని రైతులకు ఐచ్ఛికం చేసింది. పంటల కోత ప్రయోగాల ఆధారంగా కాకుండా ఒక్కో రైతు కమతాలను యూనిట్‌గా పరిగణించాలని కోరుతున్నారు. ప్రస్తుత కాలంలో పంట నష్టాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ప్రతీ గ్రామంలో వాతావరణ సమాచార నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసి వర్షాపాతం నమోదు చేపట్టాలని కోరుతున్నారు. పంటల బీమా పథకం అమలులో భాగంగా శనగ, మొక్కజొన్న, వరి, జొన్న, వేరుశనగ, పెసర్లు, మినుములు వంటి పంటలకు ఎకరానికి నిర్దేశించిన వ్యయంలో కేవలం రైతులు 1.5 శాతం డబ్బులు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. మొత్తం ప్రీమియంలో రైతు వాటా ప్రీమియం కూడా ప్రభుత్వమే భరిస్తుందని మంత్రులు చెబుతున్నారు. ఇది కార్యరూపం దాల్చితే రైతులకు భరోసా ఏర్పడుతుందంటున్నారు.



ప్రభుత్వమే ప్రీమియం చెల్లించడం సంతోషం

: చట్ల రమేష్, రైతు, బజార్‌హత్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ఈ వానాకాలం సీజన్ నుంచి ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తామని చెప్పడం ఎంతో సంతోషకరం. గత ప్రభుత్వం హయాంలో ఈ పథకం అమలుకు నోచుకోలేదు. దీంతో తుఫానులు, అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిని ఎంతో నష్టపోయాం. రైతు వాటాగా ఉన్న ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రభుత్వ వర్గాలు తెలపడం శుభసూచికం.



ఆదేశాలు రాగానే అమలు

: పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి, ఆదిలాబాద్

ప్రస్తుతానికి ఫసల్ బీమా పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేవు. అయితే, దీనికి సంబంధించి ఆదేశాలు ఇంకా రావాల్సి ఉంది. ఆదేశాలు వచ్చిన వెంటనే జిల్లావ్యాప్తంగా రైతులకు ఈ పథకాన్ని అమలు చేస్తాం.



మార్కెట్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న తాటిముంజలు

తాటిముంజలకు భలే గిరాకీ


● డజన్ ముంజలు రూ.120



ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 28: వేసవి కాలంలో విరివిగా లభించే వాటిల్లో తాటి ముంజలకు ఓ ప్రత్యేకత ఉంది. ఆదిలాబాద్‌లో పలు ప్రాంతాల్లో ముంజల అమ్మకాలు జోరందుకున్నాయి. పెద్ద ఎత్తున ప్రజలు ముంజలు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముంజలు తింటే ఆరోగ్యానికి ఎన్నో ఉపయోగాలున్నాయి. రక్తపోటు, అధిక బరువు, ఎండ వేడి నుంచి రక్షిస్తుందని వైద్య నిపుణలులు చెబుతున్నారు. మంచిర్యాల, లక్షెటిపేట, దండేపల్లి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి ఇక్కడ వాటిని విక్రయిస్తున్నారు. లేత పండ్లను ప్రజల ముందే కట్ చేసి ఇస్తున్నారు. ఒక కాయలో మూడు ముంజలుంటాయి. ఇలా డజన్ ముంజలు రూ.120 విక్రయిస్తున్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రజలు వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పిల్లలకు, పెద్దలకు ఆరోగ్య పరంగా ముంజలు ఎంతో మేలు చేస్తాయని ప్రజలంటున్నారు.

దశాబ్దాల కల నెరవేరిన వేళ

● ఘన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గుట్టపైన ఉన్న చప్రాల గిరిజన గ్రామం ● తాగునీటి సమస్యతో స్థానికుల తంటాలు ● పైప్‌లైన్ ద్వారా సమస్యను పరిష్కరించిన అధికారులు ● హర్షం వ్యక్తం చేసిన గిరిజనులు



చప్రాలకు పైప్‌లైన్ వేయిస్తూ గ్రామానికి చేరుకున్న అధికారులు



తాత్కాలిక ట్యాంకులు ఏర్పాటు చేసి నల్లాలు భిగించారిలా..

ఉట్నూర్, ఏప్రిల్ 28: ఉట్నూర్ మండలంలోని చప్రాల, గుట్టగూడ గిరిజనులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య దశాబ్దాల కల అధికారులు నెరవేర్చారు. ఘన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చప్రాల గిరిజన గ్రామం పూర్తిగా గుట్టపైన అక్కడ దశాబ్దాలుగా మంచినీటి సమస్యను గిరిజనులు ఎదుర్కొంటున్నారు.గతంలో వేసిన బోరుబావుల్లో సైతం నీరులేకపోవడంతో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీటిపారుదల పథకానికి సైతం నీరు అందుబాటులో లేక గిరినులు అవస్థలు పడుతున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రూ.3 లక్షలు బోరుబావి కోసం మంజూరు చేయడంతో మండల ప్రత్యేక అధికారి గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్, గ్రామ ప్రత్యేక అధికారి గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ సురేందర్ కార్యదర్శి ప్రవీణ్‌తో కలిసి గ్రామాన్ని సందర్శించి మంచినీటి సమస్య పరిష్కారం కోసం కొత్త బోరుబావిని గుట్టకింద ఉన్న వాగు ప్రాంతంలో వేయించి అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా గ్రామంలో ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులకు నీళ్లు చేర్చి వాటికి నల్లాలు బిగించి గ్రామీణ గిరిజనులకు శుక్రవారం నీరు అందుబాటులోకి తెచ్చారు. అదే విధంగా గ్రామానికి నీరు రావడంతో గిరిజనుల ఆనందం అంతా ఇంత కాదు. దీనిలో భాగంగా వారు మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. మంచినీటి సమస్య పరిస్కరించడానికి గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ సురేందర్‌తో కలిసి బోరుబావి వేయించడం ద్వారా నీరు అందుబాటులోకి వచ్చిందని డీడీ దిలీప్‌కుమార్ తెలిపారు. అదనంగా మరో రూ.2లక్షలు వ్యయం చేసి నీటి సమస్య పరిష్కరించామని ఏఈ సురేందర్ వివరించారు. ఏది ఏమైనా ఎన్నో రోజులుగా నీటి సమస్యను ఎదుర్కొంటున్న తమకు మంచినీరు అందుబాటులోకి వచ్చిందని గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఉట్నూర్‌లో బాటిళ్లలో నింపి కల్లు విక్రయిస్తున్నారిలా..

కల్తీకల్లుపై తుడుందెబ్బ ఉద్యమం

● ఆదివాసీ గిరిజన హక్కుల పోరాట సమితి

ఉట్నూర్, ఏప్రిల్ 28: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో అక్రమంగా అమ్మకాలు సాగిస్తున్న కల్తీ కల్లు అమ్మకాల పై ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని తుడందెబ్బ ఆదివాసీ గిరిజన హక్కుల పోరాట సమితి భావిస్తుంది. ఈ మేరకు తుడందెబ్బ ఆధ్వర్యంలోని ఆదివాసీ మహిళ సంఘం నేతృత్వంలో జిల్లాలోని తలమడుగు మండలంలో ఆదివాసీ మహిళలు కల్తీ కల్లు విక్రయాలపై పోరు ప్రారంభించారు. ఏజెన్సీ గ్రామాలో తెల్లకల్లు విక్రయాలపై నిషేధం ఉన్నప్పటికీ కొంతమంది వ్యాపారులు కల్లు విక్రయాలు జోరుగా జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాలలో అంతగా ఈత,తాటిచెట్లు లేకపోయినా.. నామమాత్రంగా చెట్ల కల్లు పోసి కల్తీ కల్లు తయారుచేసి మత్తు పదార్థాలు జోడించి విక్రయిస్తుండడంతో ఏజెన్సీ గ్రామాలకు చెందిన గ్రామీణ ప్రాంతాల ప్రజలు కల్తీ కల్లు తాగుతూ అనారోగ్య కారణాలకు గురి అవుతున్నారని గిరిజనులు అంటున్నారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, నేరడిగొండ, తాంసి, తలమడుగు, జైనథ్, బేల, నార్నూర్‌గాదిగూడ, జైనూర్, సిర్పూర్ యూ, లింగపూర్, కెరమెరి మండలాల్లో గ్రామీణ ప్రాంతాల ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుంటున్నా వ్యాపారులు తెల్లకల్లు విక్రయాలను కొనసాగిస్తున్నారు. నిఘా అధికారుల నిర్లక్ష్యం వల్లనే గిరిజన గ్రామాలలో జోరుగా కల్తీకల్లు విక్రయాలు జరుగుతున్నాయని ప్రజలు భావిస్తున్నారు. ఏదిఏమైనా పార్లమెంట్ ఎన్నికల సమయంలో మరింతగా కల్తీ కల్లు విక్రయాలు పెరిగి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, అధికారులు చర్యలు తీసుకొని కల్తీ కల్లు విక్రయాలు జరుగకుండా చూడాలని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

● **అధికారుల నిర్లక్ష్యం : బాపురావు, జిల్లా అధ్యక్షుడు, తుడుందెబ్బ**

అధికార యంత్రాంగం నిర్లక్ష్యం చేయడం వల్లనే ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయాల్సి వస్తుందని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు పుర్క.బాపురావు ఆరోపించారు. గిరిజన గ్రామాలలో కల్లు విక్రయాలను అడ్డుకోకుంటే తమ సంఘం ఆధ్వర్యంలో విక్రయాలు అడ్డుకోవడానికి సిద్ధం అవుతున్నామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఫోటో.. న్యూస్!!





● మేకలగండి వద్ద అడవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు ఇలా..

అరణ్యంలో అంతులేని కాలుష్యం!!

ప్రకృతి అందాలతో.. ఆహ్లాదకరంగా కనిపించే అటవీ ప్రాంతం కాలుష్య కారకంగా మారింది. గుడిహత్నూర్ మండల కేంద్రం సమీపంలోని మేకల గండి వద్ద అటవి ప్రాంతంలో పంచాయతీకి సంబంధించిన వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు అక్కడే పడేస్తున్నారు. అంతేకాకుండా రోజు వారీగా సేకరించిన చెత్తనంతా డంపింగ్ యార్డులో కాకుండా ఇక్కడే పడేస్తున్నారు. దీంతో చుట్టు పక్కల అటవి ప్రాంతమంతా అపరిశుభ్రంగా కనిపిస్తోంది. అయితే, ఈ ప్రాంతం జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో దట్టమైన పొగ, దుర్వాసన కారణంగా వాహనదారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడవినే డంపింగ్‌యార్డుగా వినియోగించడం పట్ల స్థానికులతో పాటు రాకపోకలు సాగించే వారు అభ్యంతరం చెబుతున్నారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

(- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)

డా.వేణుగోపాలకృష్ణకు నంది పురస్కారం

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 28: ఉత్తమ చిత్రాలుగా ప్రేమతో నాన్న, మహారాజు ఆవేదన, అలాగే ఉత్తమ నటిగా సుహాసిని, ఉత్తమ నటుడుగా డా.వేణుగోపాలకృష్ణలకు హైదరాబాద్‌లోని ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ మెగా ఎంటర్ ప్రైజెస్ వారు ఉగాది నంది పురస్కారాలు, ఐకాన్ అవార్డులు ప్రకటించారు. ప్రేమతో నాన్నలో నటించిన సుహాసిని చక్కని నటన, మంచి హావభావాలు, వేదం, భరత నాట్యం ప్రదర్శించి ఉత్తమ నటిగా ఎన్నికయ్యారు. అంతేకాకుండా సంస్కృతీ, సంప్రదాయాలు, కుటుంబ విలువలు ఉన్న ప్రేమతో నాన్న, మహారాజు ఒక రైతు బాధాకర కథ. మహారాజు రోడ్డు ప్రమాదాలు జాగ్రత్తలపై తీసిన ఆవేదన ఉత్తమ చిత్రాలుగా ఎన్నికయ్యారు. వాటిలో ప్రేమ, త్యాగం, దుఃఖం, ఆర్ధత, వివిధ భావ ప్రకటనలు, అంగీకం, వాచికం సహజంగా నటించిన డా. వేణుగోపాలకృష్ణను ఉత్తమ నటుడుగా ప్రకటించారు. రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్నో చిత్రాలు పరిశీలించి ఈ అవార్డులు ప్రకటించారు. ప్రేమతో నాన్న చిత్రానికి గాను సుహాసిని, డా. వేణుగోపాలకృష్ణ ఇదివరకే నంది పురస్కారాలు అందుకొని అందరి ప్రశంసలు పొందారు.

మే 5న నిర్మల్‌కు రాహుల్‌గాంధీ రాక

నిర్మల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 5న ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ నిర్మల్‌కు రానున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన షెడ్యూల్‌ను కాంగ్రెస్ పార్టీ వర్గాలు ధృవీకరించాయి. రాహుల్‌తో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డిలతో పాటు తదితర ముఖ్య నేతలంతా నిర్మల్ రాహుల్ సభకు హాజరుకానున్నారు. కాగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్మల్‌కు రానున్న కారణంగా కాంగ్రెస్ పార్టీ వర్గాలు పెద్దఎత్తున ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. నిర్మల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాలతో పాటు పొరుగున ఉన్న ఆదిలాబాద్ నియోజకవర్గాల నుంచి కూడా పార్టీ కార్యకర్తలను పెద్దఎత్తున సమీకరించేందుకు కాంగ్రెస్ పార్టీ వర్గాలు ఏర్పాట్లు చేపట్టబోతున్నాయి. జన సమీకరణకు సంబంధించి నియోజకవర్గాల వారిగా అక్కడి నేతలకు బాధ్యతలు అప్పగించనుంది.

పొన్నారివాసుల ఆందోళన

తాంసి, ఏప్రిల్ 28: మండలంలోని పొన్నారి గ్రామంలో మళ్లీ ఆదివారం రాత్రి పదిన్నర గంటల ప్రాంతంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన పొన్నారి వాసులు అంతర్ రాష్ట్ర రహదారి పై బైఠాయించారు. వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గత 20 రోజుల క్రితం ఓ కంటైయినర్ ఢీకొనడంతో రెవెన్యూ ఉద్యోగి మరణించారు. అది మరవకముందే మరో ఇద్దరిని కంటైయినర్ ఢీకొట్టింది. వారి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో స్థానికులు వారిని శిక్షించాలంటూ రాత్రి 11 గంటలు అయినా ఆందోళనను విరమించకపోవడం గమనార్హం.



యూనివర్సిటీ ప్రధాన ప్రవేశ ద్వారం



ఆర్జీయూకేటీ క్యాంపస్



తరగతి గదుల్లో విద్యార్థులు

ట్రిపుల్ ఐటీకి నిధుల కటకట

- ఉద్యోగుల వేతనాలు తప్ప.. అన్ని చెల్లింపుల్లో జాప్యం
- కాంట్రాక్టర్లకు రెండు నెలల బిల్లులు పెండింగ్
- విద్యార్థుల మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు ఆటంకం
- ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడమే అసలు సమస్య

బాసర, ఏప్రిల్, 28: నిర్మల్ జిల్లా బాసరలో గల రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం (ట్రిపుల్ ఐటీ)కి నిధుల సమస్య ఎదురైంది. గత కొన్ని నెలల నుంచి నిధుల కొరత వెంటాడుతోంది. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో బకాయిలు పేరుకపోతున్నాయి. మరోపక్క విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనలో తీవ్ర జాప్యం జరుగుతుంది. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నప్పటికి నిధులను విడుదల చేయకపోవడంతో యూనివర్సిటీకి పెద్ద సమస్యగా మారింది. దీంతో ప్రతినెల చెల్లింపుల కోసం అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూనివర్సిటీకి సంబంధించిన ఫిక్స్ డిపాజిట్‌ను విత్‌డ్రా చేస్తున్నారు. ఇలా వచ్చిన నిధులతో మొదటగా ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ మిగితా బిల్లులన్నీ మాత్రం రెండు నుంచి మూడు నెలలు పెండింగ్‌లో ఉంటున్నాయి.

అన్ని బిల్లులు పెండింగ్

యూనివర్సిటీ అవసరాల్లో వేతనాల తర్వాత విద్యార్థులకు భోజన వసతి కల్పించే సంస్థలకు, హౌస్‌కీపింగ్ సెక్యూరిటీ కాంట్రాక్టర్‌లకు ప్రతి నెల రూ. 4 కోట్ల నిధులు అవసరం, ఇవే కాకుండా కరెంటు బిల్లులు ఇతర అవసరాల కోసం మరో రూ. 2 నుంచి 3 కోట్లు అవసరముంటుంది. ఈ అవసరాలకు సంబంధించిన నిధుల కొరత కారణంగా బిల్లులన్నీ పెండింగ్‌లో ఉంటున్నాయి. కొన్నింటికి 15 రోజులకు, నెలవారీగా బిల్లులు చెల్లింపు చేయాల్సి ఉన్నప్పటికి రెండు నుంచి మూడు నెలలు అయినా కాంట్రాక్టర్‌లకు బిల్లులు రావడం లేదు.

విద్యార్థులకు తప్పని కష్టాలు

నిధుల కొరత విద్యార్థులకు కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. హాస్టళ్లలో, యూనివర్సిటీ విద్యార్థుల మౌలిక వసతి సౌకార్యల ఏర్పాటులో తీవ్రజాప్యం జరుగుతుంది. ల్యాప్‌టాప్‌లు, మౌలిక వసతుల మరమ్మతులు, యూనిఫామ్స్ వంటివి అధికారులు సకాలంలో విద్యార్థులకు ఏర్పాటు చేయలేకపోతున్నారు. యూనివర్సిటీలో పనిచేసిన ప్రైవేటు వ్యక్తులకు రూ.50 వేలు బిల్లు కూడా సకాలంలో రాని పరిస్థితి ఉందంటే ఇక్కడ ఆర్థిక కష్టాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

కరిగిపోతున్న యూనివర్సిటీ డిపాజిట్లు

యూనివర్సిటీకి కొన్ని బ్యాంకుల్లో నగదు డిపాజిట్లు ఉన్నాయి. మిగులు నిధులను గతంలో పనిచేసిన అధికారులు దూరదృష్టితో యూనివర్సిటీ పేరుమీద ఫిక్స్‌డిపాజిట్‌లు చేసి ఉంచారు. ఇప్పుడు అవి అధికారులు ఆర్థిక కష్టాలు ఎదురైనప్పుడల్లా డిపాజిట్‌లను డ్రా చేసేస్తున్నారు. ఇలా రెండు నెలల క్రిందట రూ. 8 కోట్లను డ్రా చేసి ఖర్చులు చేశారు. మళ్లీ ఇప్పుడు నిధులు నిండుకోవడంతో అధికారులు డిపాజిట్‌లవైపు చూస్తున్నారు. గడిచిన నాలుగు, ఐదు సంవత్సరాలలో 300 కోట్ల డిపాజిట్‌లు ఇలా కరిగిపోతూ ప్రస్తుతం రూ. 20 కోట్లు మిగిలి ఉన్నట్లు సమాచారం. మరో మూడు, నాలుగు నెలలు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోతే మిగిలిన ఈ కొన్ని డిపాజిట్‌లు కూడా పూర్తిగా మాయం కానున్నాయి.

బడ్జెట్ నిధులు విడుదల అరకొర

ప్రతి సంవత్సరం యూనివర్సిటీకి బడ్జెట్‌లో అటు ఇటుగా 30 కోట్ల వరకు కేటాయిస్తున్నారు. ఈ కేటాయించిన నిధులు యూనివర్సిటీ పూర్తి అవసరాలకు సరిపోనప్పటికి వాటిని కూడా పూర్తి స్థాయిలో ప్రభుత్వాలు విడుదల చేయడం లేదు. గత ఏడాది 50 శాతం మాత్రమే కేటాయింపుల్లో నిధులు యూనివర్సిటీకి చేరాయి. అంతకుముందు ఏడాది విద్యార్థులు ఆందోళన చేయడంతో కొన్ని నిధులను అధికంగా ఇచ్చినప్పటికి ఆ తర్వాత బాసర ట్రిపుల్ ఐటీని ప్రభుత్వం మరిచిపోయింది. కొత్తగా ఏర్పడిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం హయంలోఒక్క పైసా కూడా యూనివర్సిటీకి విడుదల చేయనట్లు సమాచారం.



రూ.50 కోట్ల స్కాలర్ షిప్‌లు పెండింగ్

ఫీజు రియంబర్స్‌మెంట్ కింద ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్ నిధులు రావాల్సి ఉంది. ఇలా విద్యార్థుల స్కాలర్ షిప్‌లు ప్రభుత్వం నుంచి రూ. 50 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. పలుమార్లు యూనివర్సిటీ అధికారులు బీసీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్ శాఖల అధికారులకు సంప్రదిస్తున్నప్పటికీ నిధులను మాత్రం విడుదల చేయడం లేదు. ప్రతియేడాది రావాల్సిన స్కాలర్ షిప్‌కు సంబంధించిన బిల్లులు సైతం సమయానికి రాకపోవడం యూనివర్సిటీ ఆర్థికకష్టాలకు మారో కారణమని చెప్పొచ్చు.

త్వరలోనే నిధుల సమస్య తీరిపోతుంది

: వెంకటరమణ, ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్, బాసర

ఉద్యోగులకు వేతనాలను ఆపడం లేదు. సమయానికి వారికి వేతనాలను చెల్లిస్తున్నాం. ఎన్ని ఆర్థిక కష్టాలు ఎదురైనప్పటికి ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఇక సంస్థలు, కాంట్రాక్టర్‌లకు నిధుల కొరత వల్ల కొంత జాప్యం జరుగుతుంది. త్వరలోనే అందరి బిల్లులను క్లియచేస్తాం.

వేసవిలో తస్మాత్ జాగ్రత్త!!

- ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు
- ముందస్తు జాగ్రత్తలతో ఉపశమనం అంటున్న నిపుణులు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 28: వేసవి కాలంలో ఏప్రిల్‌లోనే ఎండలు మండుతుండడంతో మున్ముందు పరిస్థితి ఇంకా ఎలా ఉంటుందోనని జనం బెంబెలెత్తి పోతున్నారు. ఉదయం 9గంటలకే ఎండ తీవ్ర విపరీతంగా పెరుగుతుంది. జిల్లాలో ప్రతీ రోజు 43 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో రోడ్లన్నీ ఉదయం 11గంటల నుంచే నిర్మానుష్యంగా మారి పోతున్నాయి. జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం సమయంలో రోడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అత్యావసరమైతేనే ప్రజలు బయ టకు వస్తున్నారు. వ్యవసాయం,భవన నిర్మాణ పనులకు వెళ్లే వారు పని వేళలు మార్చుకో వాలని చెబుతున్నారు. గర్భిణుల పైనా ఎండల ప్రభావం పడుతుందని, శరీరాన్ని చల్లబరిచే వ్యవస్థ దెబ్బతినకుండా తగిన రీతిలో అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. కాగా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పుల వల్లే ప్రస్తుతం వేడిఎక్కువగా ఉందని నిపుణులు చెబుతున్నారు.మున్ముందు వేడి తీవ్రత మరింత ఎక్కువగా ఉండొచ్చని హెచ్చరిస్తున్నారు.వడగాలులు వీస్తాయంటున్నారు. ఏప్రిల్,మే నెలలో మరింతగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. నిర్లక్ష్యంగా ఉంటే ప్రజలు వడదెబ్బ భారీన పడే ప్రమాదం ఉంది.





జిల్లాకేంద్రంలో ఉదయం 11 గంటల సమయంలో నిర్మానుష్యంగా కనిపిస్తున్న ఎన్టీఆర్‌చౌక్

● జిల్లాకు ఎల్లో అలర్ట్

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణ శాఖ జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అంతేకాకుండా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వడదెబ్బ భారీన పడే ప్రమాదం ఉందని, చిన్నారులు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలంటున్నారు.

● వడదెబ్బ అంటే?

ఎక్కువ ఉష్ణోగ్రతల తాకిడికి గురైతే శరీరంలోని వేడిని నియంత్రించే విధానం విఫలమై ప్రాణపాయ పరిస్థితి ఏర్పడడాన్ని వడదెబ్బ అంటారు.వేడి వాతావరణం లేదా చురుకైనా పనులతో కలిగే అధిక వేడిని శీరం తట్టుకోలేనప్పుడు ఇది సంభవి స్తుంది.అధిక ఉష్ణోగ్రతలతో శరీర ప్రాథమిక అవయవాలు విఫలమయ్యేలా చేస్తుంది.

● వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన వారిలో కాళ్ల వాపులు,కళ్లు తిరగడం,శరీర కండరాలు పట్టుకో ల్పోవడం, తీవ్ర జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక చెమట పట్టడం, తల తిరిగి పోవడం వంటివి జరిగితే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి సత్వరవైద్యం అందించాలి.

● ప్రాథమిక చికిత్స ఇలా..

1. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడకు తీసుకెళ్లాలి. చల్లని నీరు, ఐస్‌తో ఒళ్లంతా తడపాలి.
2. చల్లని గాలి తగిలేలా ఉంచాలి.
3. ఉప్పు కలిపిన మజ్జిగా, కొబ్బరిబోండాం లేదా చిటికెడు ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం,గ్లూకోజ్ ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాగించవచ్చు.
4. వడదెబ్బ తగిలి అపస్మాకరక స్థితిలోకి వెళ్తే వె ంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి.

● వడదెబ్బ బారీన పడకుండా జాగ్రత్తలు

1. వేసవిలో డీహైడ్రేషన్ అధికంగా ఉంటుంది. రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. భోజనం మితంగా చేయాలి.
2 ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు నీడన / చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించండి.
3. ఆల్కాహాల్/సిగరేట్ వంటి వాటికి దూరంగా ఉండండి.
4.ఎండలో వెళ్లేటప్పుడు కళ్లకు సన్ గ్లాసెస్, తలకు టోపి వంటివి ధరించండి.
5. వేసవిలో ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో మాత్రమే బయటికి వెళ్లేలా ప్లాన్ చేసుకోవాలి.
6. వేడి వాతావరణంలో శారీరక శ్రమ కార్యక్రమాలు చేయడం మంచిది కాదు. ఒక వేళ చేస్తే ప్రతి20నిమిషాలకు ఒకసారి 5నిమిషాలు నీడలో ఉండేలా చూసుకోవాలి.
7. ఆహారంలో ఎక్కువగా ద్రవపదార్థాలు ఉండేలా చూసుకోవాలి.
8. ప్రయాణాల్లో సోడియం, ఎలక్ట్రోలైట్ వంటి ద్రావణాలను తాగడం మంచిదని వైద్య నిపుణలు సూచిస్తున్నారు.

● చేయకూడని పనులు

1. మండు వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రత ఉన్న సమయంలో బయట ఎక్కువగా తిరగరాదు.
2. రోడ్ల పై అమ్మే కలుషిత ఆహారం తినవద్దు. ఇంట్లో వండుకున్నవి మాత్రమే తినాలంటున్నారు.
3. మాంసాహారం తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తాజా కూరగాయల్ని ఎక్కువగా ఆహారంలో తీసుకోవాలి.
4. నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయాలను ఆహారంగా తీసుకోవాలి. పుచ్చకాయలు, కీరదోస, కర్భూజ, తాటి ముంజలు, బీరకాయలు, పొట్లకాయలు వంటి వాటిలో నీటి శాతం పుష్కలంగా ఉంటుంది. అందుకే వీటి ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. దీని వల్ల కడుపు నిండినట్లుగా ఉండి, డైట్ కంట్రోల్ అవుతుందని వైద్యులు సూచిస్తున్నారు.
5. శీతల పానీయాలు, అధికంగా షుగర్ వేసిన జ్యూస్‌లు, మ్యాంగో, సపోటా వంటివి తీసుకుంటే బరువు తగ్గకపోగా, కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయని వైద్యులు సూచిస్తున్నారు.
6. వేసవిలో ఆకలి తక్కువగా దాహం ఎక్కువగా ఉంటుంది. జీర్ణక్రియలోను తేడాలు వస్తుంటాయి. డైట్‌పాటిస్తూ కాలానికి అనుగుణంగా ఆహారపదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండి బరువును నియంత్రించవచ్చు. నీరు, మజ్జిగా, కొబ్బరి నీరు తీసుకోవాలి.

● తేలిక పాటి ఆహారం ఉత్తమం

వేసవిలో సాధ్యమైనంత వరకు నూనెతో తయారు చేసిన పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, జంక్‌ఫుడ్ వంటి వాటి జోలికి వెళ్లక పోవడం ఉత్తమం. తేలిక పాటి ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ముఖ్యంగా బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పిల్లలను బయటకు పంపించవద్దు.వేసవి వేడిని తట్టుకునేందుకు నూనెలేని,తేలికపాటి ఆహారాన్ని పిల్లలకు అందించాలి. ఢీఫ్రిజ్‌లో ఉంచిన వాటిని వెంటనే తినడం, తాగడం వంటివి చేయవద్దు.సాధారణ ఉష్ణోగ్రత కంటే కొంచెం చల్లగా ఉన్న వాటిని మాత్రమే తీసుకోవాలి. భాగా చల్లగా ఉన్న నీరు తాగడం వల్ల తిన్న ఆహార పదార్థాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కూల్ డ్రింక్స్‌కు పిల్లలను దూరంగా ఉంచాలి.

● నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహారం మేలు

1. నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయాలను ఆహారంగా తీసుకోవాలి. పుచ్చకాయలు, కీరదోస, కర్భూజ, తాటిముంజలు, బీరకాయలు, పొట్లకాయలు వంటి వాటిలో నీటి శాతం పుష్కలంగా ఉంటుంది.వీటి ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి.దీని వల్ల కడుపు నిండినట్లుగా ఉండి,డైట్ కంట్రోల్ అవుతుంది.
2.శీతల పానీయాలు, అధికంగా షుగర్ వేసిన జ్యూస్‌లు, మ్యాంగో, సపోటా వంటవి తీసుకుంటే బరువు తగ్గక పోగా కొత్త సమస్యలు ఉత్పన్నమవుతాయి.
3.వేసవిలో ఆకలి తక్కువగాను దాహం ఎక్కువగాను ఉంటుంది. జీర్ణక్రియలోను తేడాలు వస్తుంటాయి. డైట్ పాటిస్తూ కాలానికి అనుగుణంగా ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండి బరువును నియంత్రించవచ్చు. నీరు, మజ్జిగా, కొబ్బరి నీరు తీసుకోవాలి.

పగలు ఎండా.. రాత్రి వాన!!

ఆదిలాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో విచిత్రమైన వాతావరణ పరిస్థితిలు నెలకొంటున్నాయి. పగలతా భానుడి భగభగలు రాత్రి వాతావారణం ఒక్కసారి చల్లబడి ఈదురుగాలులతో కూడిన జల్లు వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం జిల్లాలోని పలు మండలాల్లో జల్లు వర్షం కురిసింది. 10 గంటల తర్వాత భానుడి భగభగలతో ఉష్ణోగ్రతలు అమంతాంగా పెరిగాయి. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42.3 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 26.7 డిగ్రీలుగా నమోదైంది. అత్యధికంగా బేలా మండలంలోని 43.5, సిరికొండ మండలంలో 42.0, బోథ్ మండలం పొచ్చెరలో 42.0, ఇంద్రవెళ్లి మండలంలో 41.8, కోటూరు మండలంలో 40.7, గాదిగూడ, బజారహత్నూర్, తలమడుగు మండలంలో 40.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత కొద్దిరోజులుగా పగలంతా ఎండవేడిమి రాత్రి వేళల్లో చిరుజల్లులు కురవడంతో భిన్నమైనవాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. చేతికి వచ్చిన జోన్న పంట కోతలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఎండల తీవ్రత ఆటంకంగా మారుతుందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయంటున్నారు.

ఏఐటీయూసీనే కార్మిక చట్టాలను సాధించింది : యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 28: కార్మికచట్టాలను సాధించింది ఏఐటీ యూసీ అని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. నస్పూర్‌లోని మనోరంజన్ సముదాయంలో ఆదివారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకునేందుకు చట్టాన్ని తీసుకొచ్చింది తమ యూనియనే అన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధనకు తాము ఎన్నో ప్రాణత్యాగాలు చేశామన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించినా ఇంతవరకు గుర్తింపుపత్రం ఇవ్వకపోవడం సరికాదన్నారు. వెంటనే గుర్తింపుపత్రం అందించాలన్నారు. నూతన బొగ్గు గనుల ఏర్పాటుకు యాజమాన్యం ముందుకు రావాలన్నారు. పెర్క్స్ పై ఆదాయపు పన్నును సంస్థ చెల్లించాలన్నారు. చికాగో అమర వీరుల స్ఫూర్తితో కార్మికులు తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు సాబీర్ పాషా, ఉపప్రధాన కార్యదర్శులు కె వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, నాయకులు కొట్టె కిషన్‌రావు, సీపీఐ నాయకులు అక్బర్‌అలీ, మేకల దాసు, చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు అఫ్రోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.


● 'కార్మిక చట్టాలను అధ్యయనం చేయాలి'

మందమర్రి టౌన్: కార్మికచట్టాలను ప్రతినాయకుడు అధ్య యనం చేయాలని వాటి గురించి క్షుణ్ణంగా తెలుసుకుంటూ కార్మిక వర్గ ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం పట్ట ణంలోని ఎల్లందు క్లబ్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మందమర్రి, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్ బ్రాంచ్‌ల ట్రేడ్‌యూని యన్ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లా డారు. ఏఐటీయూసీ చరిత్ర అందరికీ తెలిసి ఉండాలన్నారు. సింగరేణిలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి కార్మికులు ఇప్ప టివరకు నాలుగుసార్లు గుర్తింపు సంఘంగా ఎన్నుకున్నారన్నారు. కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాయకులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. సింగరేణివ్యాప్తంగా ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతుల్లో చెప్పిన అంశాలను నాయకులు తప్పనిసరిగా పాటిస్తూ కార్మికుల సంక్షేమానికి కృషిచేయాలన్నారు. బూర్జువా ట్రేడ్ యూనియన్‌లకు, ఏఐటీయూసీకి ఉన్న తేడాలను తెలుసుకో వాలన్నారు. కార్మికుల పక్షాన ఏఐటీయూసీ ముమ్మర పోరాటాలు చేస్తుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్‌తిరుపతి మాట్లా డుతూ హిందుత్వమే ఎజెండాగా ముందుకు వెళ్తున్న పాలకుల విధానాలను ట్రేడ్‌యూనియన్ నాయకులు గమనించాలన్నారు. సింగరేణి రిటైర్డు పర్సనల్ ఆఫీసర్ శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల చట్టాలు, హక్కులను కాపాడేది ఏఐటీయూసీ మాత్రమే నని తెలిపారు. ఆ తర్వాత ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడారు.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.9, కనిష్ఠం 29.7



నిర్మల్

జిల్లా వార్తలు

8

సోమవారం 29 ఏప్రిల్ 2024

నేడు రైతు సమ్మేళనం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 28: బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో సోమవారం ఉదయం 11గంటలకు నిర్మల్‌లోని ఆర్కే పంక్షన్ హాల్‌లో రైతు సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి చిన్న లింగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. మోర్చా కార్యవర్గసభ్యులు, పదాధికారులు, రైతులు హాజరై జయప్రదం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

- వన్యప్రాణుల దాహం తీర్చేందుకు కవ్వాల్ అభయారణ్యంలో అటవీశాఖ పలు ఏర్పాట్లు
- చక్కగా సద్వినియోగం అవుతున్న సాసర్ పీట్లు, చెలిమెలు
- అడవి జంతువుల సంరక్షణపై పకడ్బందీ నిఘా పెట్టిన అటవీ శాఖ
- దాహం తీర్చుకునేందుకు వచ్చి కెమెరా కంటికి చిక్కుతున్న వన్యప్రాణులు




• ఖానాపూర్ అడవుల్లో సంచరిస్తున్న చిరుత



• ఖానాపూర్ అడవుల్లో సంచరిస్తున్న జింకలు



• సాసర్ పీట్ల వద్ద నీళ్లు తాగేందుకు వస్తున్న ఎలుగుబంట్లు



• ఖానాపూర్ అడవుల్లో సంచరిస్తున్న అడవి బర్రె

సాసర్ పీట్లతో సంరక్షణ..
సీసీ కెమెరాలతో పర్యవేక్షణ!



• ఖానాపూర్ అడవుల్లో సంచరిస్తున్న జింకలు

ఖానాపూర్, ఏప్రిల్ 28: పెద్ద పులుల సంరక్షణే ధ్యేయంగా ఏర్పాటుచేసిన కవ్వాల్ అభయారణ్యంలో ప్రస్తుతం శాఖాహార జంతువులతోపాటు మాంసాహార జంతువులు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. వర్షాకాలం చలికాలంలో ఈ జంతువులకు సహజంగా ఆహారం నీరు పుష్కలంగా దొరికే కవ్వాల్ అభయారణ్యంలో ఎండాకాలం వచ్చిందంటే కాస్త తాగునీటికి ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. ఈ ఇ క్కట్లను అధిగమించి వన్యప్రాణులను సంరక్షించేందుకు అటవీశాఖ ఆధ్వ ర్యంలో పలు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో నానా టికి పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలకు ఇంట్లో నీటపట్టున ఉండే మనుషులే వి లవిల్లాడిపోతుంటే అడవుల్లో ఉండే పశుపక్షాదుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే కష్టంగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో అడవుల్లో వన్యప్రాణులకు దాహం తీర్చేవాగులు, ఒర్రెలు, చెలిమెలు అన్ని ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నోరకాల జీవజాతులకు నిలయమైన కవ్వాల్ అభయారణ్యంలో వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో అడవుల్లో పలు ఏర్పాట్లు చేస్తున్నారు. అడవి జంతువుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేస్తున్న సాసర్ పీట్లు, చెలిమెలు సత్ఫలితాలనిస్తున్నాయి.

సాసర్ పీట్ల వద్ద సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని అడవుల్లో వేసవిలో వన్యప్రాణుల సంరక్షణకోసం అధికారులు ప్రత్యేకమైన చర్యలు చేపట్టారు. ఈచర్యల్లో భాగంగా ఒక్క ఖానాపూర్‌రేంజ్ పరిధిలోనే అడవి జంతువుల దాహంతీర్చేందుకు 33 సాసర్‌పీట్లను ఏర్పాటుచేశారు. ఈ సాసర్ పీట్లకు నిరంతరం ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ 33 సాసర్ పీట్లే కాకుండా సోలార్‌తో నడిచే మరో ఐదు సోలార్ సాసర్ పీట్లు సైతం ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మండలంలోని అడవులలో గల వాగులు, ఒర్రెలలో పలుచోట్ల చెలిమెలను సైతం తవ్వించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సాసర్ పీట్లు, చెలిమెల వద్ద నీరు తాగేందుకు వచ్చే వన్యప్రాణులకు వేటగాళ్ల భారీ నుంచి ఎటువంటి ఇక్కట్లు తలెత్తకుండా ఎప్పటికప్పుడు వన్యప్రాణుల సంరక్షణ బృందాలచే పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోపక్క సాసర్‌పీట్లు, చెలిమెల వద్ద 22చోట్ల కెమెరా ట్రాపులను అమర్చినట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఇలా కవ్వాల్ అభయారణ్యంలోని అన్ని అటవీ రేంజ్ కార్యాలయాల పరిధిలో వన్యప్రాణుల సంరక్షణ కోసం వేసవిలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

ఖానాపూర్‌లో కనువిందు చేస్తున్న వన్యప్రాణులు

ఖానాపూర్ అడవుల్లో సంచరిస్తున్న పలురకాల వన్యప్రాణులను కెమెరా ట్రాపులు తమకెమెరాల్లో బంధిస్తున్నాయి. ప్రస్తుతం అటవీశాఖ ఖానాపూర్ రేంజ్ పరిధిలోని అడవుల్లో ఏర్పాటుచేసిన 22 సీసీ కెమెరాల ట్రాపుల్లో చిక్కిన వన్యప్రాణుల ఫొటోలను ఇటీవల సేకరించింది. ఈ ఫొటోలలో చిరుతపులితోపాటు ఎలుగుబంటి, జింకలు, దుప్పులు, నీలుగాయిలు, అడవి బర్రెలు లాంటి పలురకాల వన్యప్రాణులు దర్శనమిస్తున్నాయి. కవ్వాల్ అభయారణ్యంలో ఉదయం సాయంత్రం వేళల్లో రహదారిపై వెళ్లే ప్రయాణికులకు సైతం పలురకాల వన్యప్రాణులు కనిపిస్తూ సందడి చేస్తున్నాయి. జూపార్కుల్లో తప్పా రాష్ట్రంలో ఏఇతర ప్రాంతాల్లో కనిపించని వన్యప్రాణులన్నీ కవ్వాల్ అభ యారణ్యంలో రోడ్లపైవెళ్తున్న వాహనదారులకు కనిపిస్తుండడంతో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి సైతం పర్యాటకులు కవ్వాల్‌కు తరలివస్తున్నారు. ఎన్నోరకాల జంతువులకు నిలయంగా ఉన్న కవ్వాల్ అభయారణ్యం పరిధిలోని ఖానాపూర్ అడవుల్లో సందడి చేస్తున్న వన్యప్రాణుల సంరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని అటవీ శాఖ అధికారులు కోరుతున్నారు. ఏ ఒక్కరు కూడా వాటికి హాని తలపెట్టకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు. అడవుల్లో అనవసరంగా నిప్పు పెట్టడం, ఊర కుక్కలు, వేట కుక్కలతో వెళ్లడం లాంటివి చేయకూడదని కోరుతున్నారు.



• సాసర్ పీట్లలో నీళ్లు నింపుతున్న అటవీ శాఖ సిబ్బంది



• వన్యప్రాణుల దాహం తీర్చేందుకు ఖానాపూర్ అడవుల్లో తవ్వించిన చెలిమెలు

వన్యప్రాణులకు హాని తలపెడితే చర్యలు



• వినాయక్, ఎఫ్ఆర్‌వో, ఖానాపూర్

అడవుల్లో సంచరించే అడవి జంతువులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉంది. వన్యప్రాణులకు హాని తలపెడితే కఠిన చర్యలు తప్పవు. ఖానాపూర్ రేంజ్ పరిధిలో వన్యప్రాణుల దాహం తీర్చేందుకు పలు రకాల ఏర్పాట్లను చేస్తున్నాం.



ఆలయంలో పిల్లలకు అక్షర శ్రీకారపూజలు జరిపిస్తున్న భక్తులు

భారీగా అక్షర శ్రీకార పూజలు

బాసర, ఏప్రిల్ 28: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో భారీగా అక్షర శ్రీకార పూజలు నమోదయ్యాయి. సరస్వతీ అమ్మవారి మూలనక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముఖ్యంగా అక్షర శ్రీకార పూజల కోసం మంచి ముహూర్తం ఉండడంతో వందలాదిమంది తమపిల్లలకు అమ్మవారి సన్నిధిలో అక్షరశ్రీకార పూజలు జరిపించారు. దినమంతా అమ్మవారి ఆలయంలో భక్తులతో కిటకిటలాడింది. రెండు అక్షరశ్రీకార మండపాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగాయి. క్యూలైన్లలో భక్తులకు దేవస్థానం వారు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆలయ ఈవో విజయరామ రావు భక్తులకు ఇబ్బంది లేకుండా పర్యవేక్షించారు.

ఆత్మరక్షణ కోసం కరాటే అవసరం: ఎస్సై



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎస్సై

ఖానాపూర్, ఏప్రిల్28: నేటి సమాజంలో ప్రతిఒక్కరికీ ఆరోగ్యంతోపాటు ఆత్మరక్షణ కోసం కరాటే అవసరమని ఖానాపూర్ ఎస్సై లింబాద్రి అన్నారు. ఆదివారం శ్రీతిరుమల బాలాజీ రైస్ మిల్లు జూకోకాయ్ కరాటే క్లాస్‌లను ఆయన ప్రారంభించారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఖచ్చితంగా కరాటేలో ప్రావీణ్యం సాధించాలని సూచించారు. సమ్మర్ క్యాంపు కోసం ఏర్పాటు చేసి ఈ వెరైటీ క్లాసులు ప్రతిరోజు సాయంత్రం 5గంటల నుంచి 7గంటల వరకు నిర్వహించబడుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ మచ్చ మనోహర్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

తానూర్, ఏప్రిల్28: ఇంటర్ ఫలితాల్లో స్టేట్ టాపర్‌గా నిలిచిన కదం అంకితను ఎమ్మెల్యే రామరావుపాటిల్ సన్మానించారు. తానూర్ మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన విద్యార్థిని అంకిత 1000 మార్కులకు 993 సాధించినట్లు ఎమ్మెల్యే రామరావుపాటిల్ ఆమెను అభినందించి భవిష్యత్తుల్లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.



స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ అంకితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

రాజ్యాంగ పరిరక్షణ కోసం అందరూ ఐక్యం కావాలి

• ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్



మాట్లాడుతున్న యోగేంద్ర యాదవ్



హాజరైన ప్రజలు

నిర్మల్‌కల్చరల్, ఏప్రిల్28: రాజ్యాంగ పరిరక్షణ కోసం అందరూ ఐక్యం కావాలని భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్ పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో ఆదివారం రాజ్యాంగ పరిరక్షణ మన కర్తవ్యంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ కోదండరాం, రాష్ట్ర కన్వీనర్ కిరణ్ కుమార్, న్యాయవాది మల్లారెడ్డి, టీపీజేఏసీ చైర్మన్ ఏ. విజయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా యోగేంద్రయాదవ్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలను దేశ పౌరులుగా సమానంగా చూడకుండా ఆక్రమణ దారులని ప్ర. దాని భావిస్తున్నారన్నారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యతను ఇందుకు అంతా ఏకంకావాలన్నారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు, ఇతర సాధారణ ప్రజలు, ముస్లింలు ఐక్యంగా నిలబడి ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. అప్పుడే దేశంలో ప్రజాస్వామ్యం హక్కులు లభిస్తాయన్నారు. డాక్టర్ సుకుమార్, కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆత్రంసుగుణను ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. కన్నెగంటి రవి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

• ఎఫ్ఆర్‌వో జైపాల్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్28: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని నిర్మల్ ఎఫ్ఆర్‌వో జైపాల్‌రెడ్డి అన్నారు. విజయ్ ఉన్నత పాఠశాల యా జమాన్యం విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డేను నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటపాటలలో చురుగ్గా పాల్గొంటే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. విద్యార్థులు దేశాన్ని ముందుకు నడిపించడంలో ముందుండాలని అన్నారు. అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి ఒక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. చైర్మన్ నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి, కూన ప్రవీణ్‌కుమార్, కరస్పాండెం ట్ మంచిర్యాల నాగభూషణం, ఆడెపు సుధాకర్, ఆమెడ కిషన్, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో జాప్యంతో..

అందని నీటి తడులు - ఎండుతున్న పంటలు

• ఈదురు గాలుల ఉధృతికి తెగిపడిన విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు కరువు • పట్టించుకోని అధికారులు



సోనారిలో మరమ్మతులకు నోచుకోని ట్రాన్స్‌ఫర్, విద్యుత్ స్తంభం



నీటి తడులు అందక ఎండుతున్న బొప్పాయి పంట

భైంసా, ఏప్రిల్ 28: వారం రోజుల క్రితం ఈదురు గాలుల బీభత్సంతో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈదురు గాలుల ఉధృతికి డివిజన్ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగిపోవడం, స్తంభాలు విరిగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు గద్దెల నుంచి కింద పడిపోవడం జరిగింది. అయితే వీటి మరమ్మతులు, పునరుద్ధరణ నిర్వహణ వ్యవస్థ ఆశించిన మేర జరుగడంలేదు. ఫలితంగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం జరుగుతోంది. ప్రధానంగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నామమాత్రంగా జరుగుతోంది. ఈ కారణంగా సాగులోనున్న వివిధ రకాల పంటలకు నీటి తడులు అందక ఎండిపోతున్నాయి. విద్యుత్ అధికారుల తీరు పట్ల రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ, మరమ్మతుల కారణంగా గంటల తరబడి త్రీఫేజ్ సరఫరా నిలిచిపోతుండటం అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈదురుగాలుల బీభత్సం జరిగి వారం రోజుల కాలం పూర్తయినప్పటికి మరమ్మతుల నిర్వహణలో విద్యుత్ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటం మూలంగా తాము ఇబ్బందులు పడుతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ సరఫరాను మెరుగుపర్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆరెంజ్ జోన్‌లో నిర్మల్

• రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

• కడెంలో అత్యధికంగా 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

నిర్మల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. ఆదివారం జిల్లావ్యాప్తంగా అన్నిమండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడంతో నిర్మల్ జిల్లా ఆరెంజ్ జోన్‌లో ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. కడెం మండలంలో అత్యధికంగా 43.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, లోకేశ్వరంలో అత్యల్పంగా 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భారీగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఎండవేడిమిని తట్టుకునేలా జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్యనిపుణులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్పా ఇంటినుంచి బయటకు రావొద్దని జిల్లా అధికార యంత్రాంగం చెబుతోంది.

విధులు కేటాయించకపోవడం పట్ల ట్యూటర్ల నిరసన

నిర్మల్‌కల్చరల్, ఏప్రిల్28: సార్వత్రిక పదో తరగతి పరీక్షల విధుల నిర్వహణ బాధ్యతను ట్యూటర్లకు కేటాయించకపోవడం పట్ల వారు నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌నాయక్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా విధులు కేటాయింపు చేసిన విషయంపై ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కడెం, దస్తూరాబాద్ ప్రాంతాల వారికి ఖానాపూర్‌లో కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిక్షపతి నాయక్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

మే1 నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్28: మే1 నుంచి 4వరకు ఎన్నికల నిర్వహణపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు నోడల్ అధికారి రవీందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశానుసారం నిర్మల్, ఖానాపూర్, ముథోల్ పరిధిలోని పీవో, ఏపీవోలకు ఈ శిక్షణ ఉంటుందని, ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

ఆరోగ్యం, భద్రత కార్మికుల ప్రాథమిక హక్కుగా గుర్తించాలి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 28: ఆరోగ్యం, భద్రత కార్మికుల ప్రాథమిక హక్కుగా గుర్తించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం అంతర్జాతీయ కార్మికులస్మారక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.స్వదేశ్ మాట్లాడుతూ విదేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లిన కార్మికులు, ఉద్యోగులకు సురక్షితమైన పని ప్రదేశాలు కలిగి ఉండే హక్కుల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. గల్ఫ్ స్టేట్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం, భద్రతను ప్రాథమిక హక్కుగా గుర్తించాలన్నారు. సమావేశంలో గల్ఫ్ బాధిత కుటుంబాలు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన గల్ఫ్ బాధిత కుటుంబాలు